క్లుప్తంగా

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నెల్లూరురూరల్: ముత్తుకూరురోడ్డులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో ఎంతో కాలంగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎదుట ధర్నా చేపడుతున్న కార్మికులకు సోమవారం వారు మద్దతు తెలిపారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నాయకులు నాగభూషణం, కిన్నెర కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'కిమ్స్'లో రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్



నెల్లూరు సిటీ: నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్‌ను కిమ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కర్, బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని శీనయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి అటెండర్ల కార్ పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రోబోటిక్ కార్ పార్కింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. 91 కార్లను పార్కింగ్ చేసుకునే విధంగా యూనిట్‌ను నిర్మించామన్నారు. కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ గిరినాయుడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం



నెల్లూరు సిటీ: నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియంలో నారాయణ నర్సింగ్ కళాశాల 19వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నారాయణ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీ హరిప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ విద్య పూర్తి చేసిన వారికి ఎన్నో రంగాల్లో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్స్ బీ వనజకుమారి, ఐవీ మమత, వైద్యవిద్యా సంస్థల ఆపరేషన్స్ హెడ్ రామారావు, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ ఎథిక్స్‌పై అవగాహన

నెల్లూరు సిటీ: నారాయణ మెడికల్ కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేట్స్‌కు మెడికల్ ఎథిక్స్‌పై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపు రమేష్ హాజరై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బీ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవి దేవస్థానం ఈఓగా వెంకటసుబ్బయ్య



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరిదేవి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా జే వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై నెల్లూరు వచ్చారు. ఆయనకు ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి బాధ్యతలు అప్పగించారు.

జీజీహెచ్‌లో కేంద్ర బృందం



నెల్లూరు సిటీ: బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో సోమవారం జిల్లాకు వచ్చిన కేంద్ర వైద్యారోగ్య శాఖ బృందం నగరంలోని జిల్లా సర్వజన వైద్యశాలను సందర్శించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్‌తో సమావేశమై ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంలో ఎన్‌సీడీసీ డైరెక్టర్ డాక్టర్ స్మిత సింగల్, ప్రజా ఆరోగ్య స్పెషాలిటీ డాక్టర్ గురుమిత్‌కౌర్, మౌలానా ఆజాద్ మెడికల్ కళాశాల డాక్టర్ శ్రేయశర్మ ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

నెల్లూరు సిటీ: ప్రజారవాణాకు సంబంధించి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి పీవీ శేషయ్య సోమవారం తెలిపారు. 0861 232 5196 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సూచనలు, సలహాలు అందించవచ్చని తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండల వలంటీర్ల సేవలు అభినందనీయమని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో రూరల్ మండలంలోని 18 పంచాయతీల పరిధిలోని వలంటీర్లకు సేవ వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలను సోమవారం సాయంత్రం ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వలంటీర్ల సేవలను ప్రభుత్వం గుర్తించిందని, భవిష్యత్‌లో వారికి మేలు చేకూర్చే విధంగా కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. వలంటీర్ల అంకితభావానికి సేవా పురస్కారాలు అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన వలంటీర్లు వారధిలో వ్యవహరించి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైస్ ఎంపీపీ రవీంద్రరెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

• నగర నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా శాంతియుత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించాలని నగర నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని అనుసరించి ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు విధులను నిర్వర్తించాలని సూచించారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో నగర నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సిబ్బందికి రెండ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణపై రెండ్రోజుల పాటు సమగ్ర శిక్షణ అందించామని తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసీడింగ్ అధికారుల విధులు, ఎన్నికల రోజు చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల సామగ్రి రవాణా, సరఫరా, ఈవీఎం మెషీన్ల నిర్వహణ, పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, తర్వాత రోజు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటించేలా ప్రతి దశలో అప్రమత్తత, పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా దోష రహితంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో అవసరమయ్యే ప్రతి మెటీరియల్‌ను మైక్రోప్లాన్‌కు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సమస్యలకు కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి స్థానికుల్లో ఉన్న భయాలను పోగొట్టాలన్నారు. శిక్షకులు సీహెచ్ వెంకట్రావు, ఆర్ సురేష్‌బాబు, పెంచలయ్య, బ్రహ్మయ్య, శ్రీకాంత్, నరసింహప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా ఎదగాలి



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ చెన్నుడు

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బీవీనగర్ కేఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ సెంటర్, నిప్పోసెంటర్ సాయిబాబాగుడి వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రతి నిరుపేద దేశంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రిలోనైనా రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చని తెలిపారు. సురక్ష బీమా పథకం ద్వారా ఏడాదికి రూ.20 చెల్లిస్తే లబ్ధిదారు ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు అందజేస్తుందన్నారు. జీవన జ్యోతి పథకం కింద ఏడాదికి రూ.436 కడితే సహజ మరణానికి రూ.2 లక్షలు బీమా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, ఎరబోలు రాజేష్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను బాధ్యతతో పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను బాధ్యతతో పరిష్కరించాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళికకు 6, ఇంజినీరింగ్‌కు 9, రెవెన్యూకు 4, హౌసింగ్‌కు 5, ప్రజారోగ్యానికి 2 చొప్పున మొత్తం 26 ఫిర్యాదులు అందగా వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీల ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులే పరిశీలించాలన్నారు. విభాగాల వారీగా జగనన్నకు చెబుదాంకు వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం తరువాత సంబంధిత వ్యక్తికి సమాచారం తెలియజేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ను ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి పరిష్కారాలపై సమీక్ష చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు దశయ్య, ధనుంజయరెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, మేనేజర్ ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

• నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్ కోరారు. నగరంలోని 11, 6,7 డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన సామాన్య వ్యక్తిని అయిన తనకు నగర నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ప్రతిఒక్కరూ సహకరించి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్లు గోతం అరుణ, మద్దినేని మస్తానమ్మ, పార్టీ ఏడో డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్

• ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మార్చిలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఆయా పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లాలోని ఈఈలు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలోని వరికుంటపాడు, కొండాపురం, జలదంకి, కలిగిరి, రాపూరు, ఓజిలి, కలిగిరి, కావలి రూరల్ విద్యుత్ సెక్షన్ల పరిధిలో జీఐఎస్ సర్వే పనులు ఇంకా పూర్తి చేయలేదని, వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నివేదికలు పంపాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఏర్పడే లోపాలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఆర్ల శ్రీనివాసులు

నెల్లూరు(క్రైమ్): నగర ప్రజలకు మెరుగైన ట్రాఫిక్‌ను అందించేందుకు కృషి చేస్తానని నూతన ట్రాఫిక్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన నగర ట్రా ఫిక్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆ యనకు సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రోశయ్య, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకా ంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీ నగరంలో ట్రాఫిక్ తీరుతెన్నులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు అందరం సమష్టిగా పనిచేసి ట్రాఫిక్‌ను మరింత మెరుగుపరుద్దామని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

1991 బ్యాచ్ ఎస్సై

నంద్యాల జిల్లాకు చెందిన ఏ శ్రీనివాసులు 1991బ్యాచ్ ఎస్సైగా పోలీసు శాఖలో బాధ్యతలు చేపట్టారు. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ఎస్సైగా, సీఐగా పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది అనంతపురం జిల్లా తాడిపత్రి దిశ పోలీసుస్టేషన్, కదిరి, ఏలూరు జిల్లా పోలవరంలో పనిచేశారు. డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా నియమితులయ్యారు.

నేడు నేదురుమల్లి జయంతి వేడుకలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరా భవన్‌లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 89వ జయంతి వేడుకలను మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పీసీసీ సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేదురుమల్లి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కామధేను పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): ఇందుకూరుపేటలోని శ్రీలలితామహేశ్వరి ఆశ్రమంలో జాతీయస్థాయిలో అర్చకులు, వేదపండితులు, పీఠాధిపతులకు కామధేను పురస్కారాలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రదానం చేయనున్నట్లు ఆ ఆశ్రమ పీఠాధిపతులు రామాయణం మహేష్‌స్వామి తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలోని 8 రాష్ట్రాలకు చెందిన వేదపండితులు, అర్చకులు, పీఠాధిపతులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మైపాడు రాజా కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. టీటీడీ మాజీ ఈఓ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి పురస్కారాలను ప్రదానం చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కేదార్‌నాథ్ మహాశివునికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, అర్చకులు, వేదపండితులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రాపూరుకు చెందిన రమేష్‌రెడ్డి గత కొంతకాలంగా నెల్లూరులో నివాసం ఉంటున్నారు. మద్రాసుబస్టాండ్ వద్దనున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తుండగా చిన్నబజారు ఎస్సై ఏ సైదులు సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 8 క్వార్టర్‌ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేడు రంగడి సన్నిధిలో భీష్మ ఏకాదశి

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశి సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 8.30గంటలకు శ్రీవారికి తిరుమంజనం, సాయంత్రం 6.30 గంటలకు గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి కృపకుపాత్రులు కావాలని కోరారు.

'ఉల్లిపాయల'కు అభినందనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఉల్లిపాయల మురళీకృష్ణయాదవ్‌కు సోమవారం పలువురు అభినందనలు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘ నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగించే మురళీకృష్ణయాదవ్ డీవీఎంసీ సభ్యుడిగా నియమితులవడం అభినందనీయమని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కొనె శారద 45ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. గతేడాది గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు శారద ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. రజత పతకం సాధించిన శారదను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, జిల్లా అధ్యక్షుడు దూడల సుధాకర్ అభినందించారని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ వెంకటజ్యోతి,తదితరులతో ఎంపీ ఆదాల

నెల్లూరురూరల్: వైఎస్సార్‌సీపీలో కొత్తగా చేరిన వారు, పాత వారు సమష్టిగా రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైవీ రామిరెడ్డి, నాయకులు ఖాసీం, సతీష్, కమల్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ రావుల వెంకటజ్యోతి ఎంపీ ఆదాల సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. ఆమెకు ఎంపీ ఆదాల పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 30వ డివిజన్‌కు చెందిన 500 మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని ఎంపీ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, 29వ డివిజన్ నాయకులు సూరిబాబు, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీసునంద, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

• కలెక్టర్ హరినారాయణన్



అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగన్ననకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో డీఆర్ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మితలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, గృహ నిర్మాణశాఖ, ఐసీడీఎస్ పీడీలు సాంబశివారెడ్డి, నాగరాజు, హేనాసుజన్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ కృష్ణమోహన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, డీఈఓ రామారావు, డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

'రామన్ ఎఫెక్ట్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు గూడూరు సురేందర్‌రెడ్డి రచించిన రామన్ ఎఫెక్ట్ పుస్తకాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామన్ ఎఫెక్ట్‌పై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు రామన్ ఎఫెక్ట్ పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. అనంతరం గూడూరు సురేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. నగరంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్స్ ఫోరం రాష్ట్ర నాయకులు రాములు, వెంకటేశ్వర్లు, జయప్రకాష్, ఫణికుమార్, శైలజ, సురేఖ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సాహసం సినిమా షూటింగ్ ప్రారంభం



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): ప్రతిభగల నవతరం నటీనటులను చలనచిత్ర రంగంతో పాటు ప్రేక్షకులు ఆదరించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అన్నారు. డివైన్‌స్టార్ సుమన్ సమర్పణలో సుఫియా పర్వేజ్ ప్రధాన పాత్రలో హీరో ప్రవీణ్ నటిస్తున్న 'సాహసం' చిత్రం షూటింగ్‌ను సోమవారం ప్రారంభించారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమరావతి కృష్ణారెడ్డి క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శకుడు రషీద్‌తో నటుడు సుమన్‌కు 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. సాహసం తరువాత రషీద్ దర్శకత్వంలో సుమన్ హీరోగా జీ రిషి కుమార్‌రెడ్డి నిర్మాతగా భారీ బడ్జెట్ సినిమా రూపుదిద్దుకోనుందని వెల్లడించారు. తెలుగుతెరకు సుఫియా పర్వేజ్ హీరోయిన్‌గా పరిచయం కానుందన్నారు. దర్శకుడు రషీద్, చిత్రనిర్మాత సుబ్బారావు,నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ శివలంకి, 25కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, ఎస్ హరనాథ్‌రెడ్డి మూవీఆర్టిస్ట్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శైలజ, నాగేశ్వరరావు, రెమో, రామ్‌ప్రసాద్, వెంకటేష్, డీఓపీ ప్రవీణ్, నటీనటులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోండి



మార్కెట్‌లో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యం మెరుగునకు వ్యాపారులు సహకరించాలని నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి అన్నారు. నగరంలోని మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్, నవాబుపేటలోని మార్కెట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలుదారులు ఇబ్బందులు పడకుండా దుకాణాల పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలు రోడ్ల మీదకు రాకుండా చూడాలన్నారు. మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. వైస్‌చైర్మన్ ఒట్టూరు సుధాకర్, డైరెక్టర్ వెంకటేష్, సెక్రటరీ నవీన్ పాల్గొన్నారు.

వృద్ధుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పోలీసులకు ఫిర్యాదు చేశారన్న అనుమానంతో ఓ వృద్ధుడిపై కొందరు యువకులు హత్యాయత్నం చేసిన ఘటన నగరంలోని సంతపేటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంతపేటలో గోవర్ధన్ కుటుంబం నివాసం ఉంటోంది. వృద్ధుడి ఇంటికి సమీపంలో ఉన్న స్థలంలో అదే ప్రాంతానికి చెందిన దస్తగిరి, మస్తాన్, ఉమర్, అజిత్, కుల్లా, నవీద్ నిత్యం మద్యం తాగి అల్లరి చేస్తుండేవారు. ఇటీవల పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మందలించారు. గోవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్న అనుమానంతో వారు కక్ష పెంచుకున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి గోవర్ధన్ తన కొడుకుతో కలిసి ఇంటి ముందు మాట్లాడుతుండగా నిందితులు రాళ్లు, రాడ్లతో దాడి చేశారు. గాయాలపాలైన ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.